మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# 22న ప్రతి ఆలయాన్ని శుద్ధి చేయాలి

● బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి14 ప్రభాతవార్త:** ఈనెల 22న అయోధ్యలో బలరా ముడి ప్రతిష్టాపన జరగనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి ఆలయాన్ని శుద్ధి చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ పిలుపునిచ్చారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు మాజీ మంత్రి డికె అరుణ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వచ్ఛ దేవాలయ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశం లోని దేవాలయాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు శ్రమదానంలో పాల్గొ నాలని ప్రధాని నరెంద్రమోడీ పిలుపు మేరకు ఆదివారం పద్మావతి కాలనీలోని మర్లు పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శుద్ధి కార్యక్రమం చేపట్టి ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల22న అయో ధ్య నగరంలో బాల రామ ప్రాణప్రతిష్ట జరుగుతుందని, దేశంలోని ప్రతి దేవాలయాన్ని పరిశుభ్రంగా శుద్ధిచేసి పూజా కార్యక్రమాలునిర్వహించాలని దేశప్రధాని నరెంద్రమోడీ పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు తమ గ్రామాలలో, వార్డులలో ఉన్న ఆలయాలను శుద్ధి చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆలయంలో మొక్కలకు నీళ్ల పోశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు సుధాకర్, కృష్ణయ్య, బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

● తిరుమలనాథుని ఉత్సవాల్లో భాగం కావడం ఆనందంగా ఉంది

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 14 ప్రభాతవార్త:** తిరుమలనాథుని ఉత్స వాల్లో భాగం కావడం ఆనందంగా ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్న శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం హన్వాడ మండలం గొండ్యాల గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా జరిగిన రథోత్స వంలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. శ్రీ తిరుమలనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకు తిరుమలనాథుని శేషవస్త్రంతో సత్కరించింది. తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయంగా వెలసిన శ్రీతిరుమలనాథుని సేవలో ఈ నూతన సంవత్స రం ప్రారంభంలో గడపడం నాకు చాలా సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సుఖ సంతోషాలతో వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. దేవాలయ ప్రాంగణంలో ఎంతో ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొండ్యాల సర్పంచ్ రాంపూర్ వెంకటయ్య, మండల అధ్యక్షులు టంకర కృష్ణయ్య యాదవ్, నంబి వెంకటాద్రి, రమేష్,నాయకులు ఎన్‌పి వెంకటేష్, మారెపల్లి సురెందర్‌రెడ్డి, బుద్దారం సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థి దినేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

విద్యార్థి మృతదేహం తెప్పించేందుకు సిఎంతో మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే



గట్టు ఎంకన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి,జనవరి 14,ప్రభాతవార్త :** పట్టణంలోని 13వ వార్డుకు చెందిన గట్టు ఎంకన్న కుమారుడు దినేష్ గత సంవత్స రం డిసెంబర్ 28వ తేదీన ఉన్నత చదువుల కోసం యునైటెడ్ స్టేట్స్‌కి వెళ్ళాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం చేసి పడుకున్న విద్యార్థి పడుకున్నట్లుగానే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర దిగ్భ్రాంతిని తెలియజేశారు. మృతదేహాన్ని తీసుకురావటానికి సిఎం రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా మాట్లాడారు. అందుకు సానుకూలంగా స్పందించిన సిఎం సైతం విద్యార్థి దినేష్ 23 మృదేహాన్ని సొంత గ్రామం చేర్చేందుకు కావలసిన ఏర్పాట్లను అత్యవసరంగా చేయిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. దినేష్ మృతదేహం ఇంటికి చేరేంతవరకు తను ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే మేఘా రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని కల్పించారు.

## ప్రధాని మోడీ చెంచులతో నిర్వహించు సమావేశానికి చెంచులందరు హాజరు కావాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ప్రధాని మోడీ వర్చ్యువల్ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 14 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్(పీఎం జన్‌మన్‌యోజన)పథకంలోనే భాగంగానే సోమవారం ప్రధాని మోడీ గిరిజన ప్రాంత చెంచులతో వర్చ్యువల్‌గా నిర్వహించే సమావేశానికి జిల్లా యందలి 88 ఆవాస గ్రామాల చెంచు ప్రజలందరు ఆహ్వానితులేనని, చెంచులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదివారం సాయంత్రం తెలిపారు. డిల్లి ఉంచి వర్చ్యువల్‌గా ప్రధాని నిర్వహించే సమావేశం సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందని, 88 చెంచు గ్రామాల చెంచు లబ్దిదారులందరు ఉదయం 10 గంటలకే మన్ననూర్ వేధిక వద్దకు హాజరు కావాలన్నారు. ప్రధాని వర్చ్యువల్ సమావేశానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను మన్ననూర్ గిరిజన గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లను అధికారులు ఏర్పాట్లు చేసినట్లు ఆయనపేర్కొన్నారు. సమావేశానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కూడా హాజరవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# సంబరాల సంక్రాంతి



◆హరిదాసుల సంకీర్తనలు ◆గంగిరెద్దుల విన్యాసాలు

◆రంగవల్లులలోగిళ్లు.. గొబ్బెమ్మల అలంకరణలు..

◆పిండివంటలు..నేతిగారెలు,అల్లుళ్ల కోలాహలాలు..

◆గాలిపటాలతో చిన్నారుల కేరింతలు..

◆ఎడ్లబండ్ల ప్రదర్శనలు..సంక్రాంతికి నిలువెత్తు నిదర్శనాలు..

◆తెలుగువారి మూడ్రోజుల ముచ్చటైన పండుగ..

◆మకర సంక్రాంతి నేడు..!!

**భూత్పూర్,జనవరి14, ప్రభాతవార్త :** తెలతెల్లవారక ముందే హరిదాసుల సంకీర్తనలు..గంగిరెద్దుల విన్యాసాలు..ఇంటి లోగిళ్లలో రంగవల్లుల అల్లికలు..గొబ్బెమ్మలతో అమ్మలక్కలు,ఆడపడుచుల ఆటపాటలు..మామిడాకుల తోరణాలు..నేతిగారెలు,పిండివంటలు..కొత్త అల్లుళ్ల కోలాహలాలు వెరసి సంక్రాంతి సంబరాలు..తెలుగువారు జరిపే అతిపెద్ద పండుగలలో సంక్రాంతిని గొప్పగా చెప్పుకోవచ్చు. మిగితా పండుగలు ఒక రోజు మాత్రమే జరుపుతారు. కానీ సంక్రాంతిని తెలుగింటి అమ్మలక్కలు,ఆడపడుచులు,రైతులు,చిన్నారులుమూడ్రోజులు ముచ్చటగా జరుపుతారు. సూర్మ భ్రమణంపై ఆధార పడిన ఈ పండుగ ప్రతీ ఏటా పుష్యమాసంలో వస్తుంది. వణికించే చలి నుంచి తమను తాము కాపాడుకునేందుకు ఇంటి ముందర భోగి మంటలు వేసి చలికాచుకుంటారు. సూర్యుడు కర్కటక రేఖ నుంచి మకర రేఖలో ప్రవేశించడంతో ఈ పండుగను మకర సంక్రాంతిగా పిలుస్తారు. దక్షిణాయనం పూర్తవుతున్న రోజును భోగిగాను,సూర్యుడు మకర రేఖలో ప్రవేశిస్తున్నాడు కాబట్టి రెండో రోజు సంక్రాంతిని మకర సంక్రాంతిగాను,మూడో రోజును కనుమ పండుగగాను సంబరాల సంక్రాంతిని జరుపుతారు. భోగభాగ్యాలతో తులతూగాలని పాత సంవత్సరానికి స్వస్తి పలుకుతూ పాత దుస్తులు,ఇంటోని పాత వస్తువుల్ని భోగి మంటల్లో వేసి భోగి మంటల చుటూ మగవారు,బాలురు కోలాటాలు,ఆమ్మలక్కలు,ఆడపడుచులు,బాలికలు బొడ్డెమ్మలతో ఆడుతూ పాడుతూ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తారు. నువ్వుల కట్టెల చుట్టగా కట్టి జ్యోతి వెలిగించి నువ్వుల కట్టల జ్యోతి కింద తమ పిల్లలను కూర్చోబెట్లుకుని జ్యోతిని తిప్పుతారు. ఏదైనా పీడలు, కష్టాలు,ఆరిష్టాలు జ్యోతి వల్ల దగ్ధమవుతాయని వారి ప్రగాఢ విశ్వాసం. రెండో రోజు మకర సంక్రాంతి రోజన అమ్మలక్కలూ ఆడపడుచులు,ఆడపడుచులు,బాలికలు తెల్లారక ముందే తలంటు స్నానాలాచరించి కొత్తదుస్తులు ధరించి ఇంటి లోగిళ్లలో రంగురంగుల రంగవల్లులనల్లి రంగవల్లుల నడుమ గొబ్బెమ్మల నుంచి రేగుపండ్లు, నవధాన్యాలుంచి బొడ్డెలేస్తారు. గుమగుమలాడే పిండివంట లు,నేతగారెలు,పులగం పాయసాలు రుచికరమైన తీపి పదార్థాలతో ఇంటికి వచ్చి అల్లుళ్లతో సరదాగా సరదాల సంక్రాంతిని జరుపుతారు. ఆరుగాలం శ్రమించి చేతికొచ్చిన ధన ధాన్యంతో రైతన్న ఆనందహేలతో తన జీవనాధారమైన కాడెద్దుల్ని పూజించి వాటికి పంచభక్ష పరమాన్నాలు నైవేద్యంగా సమర్పిస్తూ సంతోషానికి నిదర్శనంగా ఎద్దులను అందంగా అలంకరిస్తూ ఎద్దల బండ్లను కట్టి ఉత్తరాయణ పుణ్యకాలం కాబట్టి మకర సంక్రాంతి రోజున ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తూ దేవాలయాల చుట్టూ ఎద్దుల బండ్లను తిప్పుతారు. సంక్రాంతి పండుగ మూడ్రోజులు హరిదాసులు ఇల్లిళ్లు,వీధిన తిరుగుతూ ఖహరిలో రంగ హరి..శ్రీమద్రమారమణ గోవిందా..।అంటూ సంకీర్తనలు పాడుతూ మేల్కొపుతుంటారు. ఇక చిన్నారి బాలలు గాలిపటాలనెగురవేస్తూ కేరింతలు కొడుతూ పండుగను ఎంతో సంబురంగా గడిపేస్తారు.



(ఫైల్)



# రామన్‌పాడు ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయండి

● రైతాంగం కోసం సత్వరం చర్యలు తీసుకోండి

● సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు

● రామన్‌పాడు ప్రాజెక్ట్‌ను సందర్శించిన మంత్రి



సంబంధిత అధికారులతో కలిసి రామన్‌పాడు ప్రాజెక్ట్‌ను సందర్శించిన మంత్రి



**వనపర్తి ప్రతినిధి,జనవరి 14,ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి ఖరీఫ్ పంట చివరి తడికి నీళ్ల అందించాలని, అందుకు అవసరమైన నీటిని రామన్‌పాడ్ జలాశయం నుంచి విడు దల చేయాలని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ పంటకు సరిపడా నీరులేక పంటలు ఎండిపోతున్నాయని, కనీసం చివరి తడికైనా నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు..రామన్‌పాడ్ ప్రాజెక్ట్‌ను సందర్శించి, జలాశయంలో నీటి లభ్యతపై నీటిపారుదశాఖ అధికారులను ఆరా తీశారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులులేకుండా,పంట చివరి తడికి సాగునీరందేలా సాగునీరు అందేలా అమరచింత, ఆత్మ కూర్, మదనాపురం కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగపురం,వీపనగండ్ల,చిన్నంబావి మండలాలకు లెఫ్ట్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు సమకూరుతుంది. బీమా ఎత్తిపోతల పథకం ద్వారా కొత్తకోట,శ్రీరంగపురం, వీపన గండ్ల, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు సమకూరుతుంది. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్ట్‌లో నీటి లభ్యత తక్కువగా ఉంది. దీంతో కనీసం చివరి తడికి నీరందంచాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ పంట చివరి తడికి నీటిని విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ సత్యశీల రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా శ్రీరంగాపురం

పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



మంత్రి జూపల్లికి రంగనాథ స్వామి ఆలయం గురించి వివరిస్తున్న జడ్పీటిసి

**శ్రీరంగాపురం మండలం,జనవరి 14,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయుటకు శక్తీవంతం లేకుండా కృషి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ ,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మంత్రి జూపల్లి తో పాటు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి,శ్రీరంగాపురం జడ్పిటిసి,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ సంక్రాంతి పండగలో భాగంగా శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని సందర్శించారు. జెడ్పిటిసి రాజేంద్ర ప్రసాద్ టూరిజం గెస్ట్ హౌస్‌ను వాడుకలోకి తీసుకురావాలని,శ్రీరంగాపురం మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని మంత్రికి విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ,శ్రీరంగాపురంలోని రంగనాథ స్వామి అతి ప్రాచీనమైనటువంటి దేవాలయాన్ని పర్యాట ప్రాంతంగా దేశ విదేశాల నుంచి భక్తులు వచ్చే విధంగా దీన్ని తీర్చిదిద్దేటువంటి బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెలిపారు. అనంతరం రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి,ఎమ్మెల్యే శ్రీరంగసముద్రం ప్రధాన కాలవను పరిశీలించారు. వీటితో పాటు జూరాల కాలువలకు మరమ్మత్తులను చేయాల్సిన అవసరం ఉందని తప్పకుండా చేయించి ప్రతి ఆయకట్టును చివరి రైతు వరకు నీళ్ల అందే విధంగా కృషి చేస్తామని అన్నారు.

# హత్య హింసా సంస్కృతి మంచిది కాదు

- ఇలాంటి వాటిని మంత్రి జూపల్లి ప్రొత్సహించరాదు
- హత్యకు గురైన మల్లేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం..
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 14 ప్రభాతవార్త:** హత్యలు, హింసా సంస్కృతి మంచిది కాదని, ఇలాంటి వాటిని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రొత్స హించరాదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో డిసెంబర్ 29న కాంగ్రెస్ నాయకుల చేతుల్లో దారుణ హత్యకు గురైన బీఆర్‌ఎస్ కార్యకర్త, రిటైర్డు ఆర్మీ జవాన్ చిక్కేపల్లి మల్లేష్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, ఎమ్మెల్సీ షబీపూర్ రాజు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అభిలాష్‌రావులతో కలిసి పరామర్శించారు. మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మల్లేష భార్య పిల్లలు, కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించారు. మల్లేష్ పిల్లల పూర్తి బాధ్యతను పార్టీ తీసుకుంటుందని, వారికి పార్టీ తరుపున రూ.5లక్షల చెక్కును కేటీఆర్ అందించారు. బీఆర్‌ఎస్ ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎప్పుడు రాజకీయ హత్యలు జరలేవన్న కేటీఆర్ నేడు కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎప్పుడు లేని విధంగా రాజకీయప్రత్యర్థులు,రాజకీయ కక్ష్యతో మల్లేష్‌ను హత్య చేశారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములను సహజమని, కానీ ఈ విధంగా హత్యలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్న ఇలాంటి దుర్మార్గమైన నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మల్లేష్ కుటుంబానికి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశాఉ. రాజకీయ కారణాలతో మల్లేష్‌ను హత్య చేసి దానికి భూ తగాదాల అంశాన్ని జోడించే ప్రయత్నాన్ని చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంలో ప్రభుత్వం పక్షపాతం లేకుండా విచారణ జరిపించాలని, నేరస్థులకు సంబంధించిన కాల్ రికార్డుల వంటి కీలకమైన వివరాలన్నింటిని ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో డీజీపీస్వయంగా చొరవ తీసుకొని నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలపై ఈగ వాలిన పార్టీ మొత్తం తరలివస్తుందని, ప్రతి ఒక్క కార్యకర్తకు వారి కుటుంబాలకు అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలపైన దాడులు చేస్తే ఊరుకునేదే లేదని హెచ్చరించారు. తెలంగాణలో గతంలో ఎన్నడు లేని విధంగా ప్రారంభమైన ఈ హత్య రాజకీయాలను,రాజకీయ హింససంస్కృతిని మీడియా ప్రజల ముందు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి హత్య రాజకీయాలకు పాల్పడితే ప్రజలు తిరుగబడుతారనే విషయం కాంగ్రెస్ పార్టీ గుర్తించాలన్నారు. మల్లేష్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు.



మల్లేష్ కుటుంబానికి చెక్ అందజేస్తున్న కేటీఆర్

## మాజీ జవాన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎల్లేని

**కొల్లాపూర్,జనవరి14 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని పెద్ద కొత్తపల్లి మండలం, గంట్రావుపల్లి గ్రామానికి చెందిన బిజెపి మాజీ మండల ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ మాజీ జవాన్ మల్లేష్ యాదవ్‌ను కొద్దిరోజుల క్రితం భూతగాదాల వల్ల కొంతమంది దుండగులు హతమార్చడం జరిగిందన్న విషయం తెలుసుకున్న బిజెపి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు కొల్లాపూర్ నియోజకవర్గ ఇంఛార్జి ఎల్లేని సుధాకంరావు ఆదివారం గంట్రావుపల్లి గ్రామాన్ని సందర్శించి ఆర్మీ జవాన్ మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని నింపారు. మల్లేష్ యాదవ్‌ను హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని, బిజెపి పార్టీ తరపున తమ మద్దతు ఎప్పుడు మల్లేష్ కుటుంబానికి ఉంటుందని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గోదాదేవి కళ్యాణోత్సవం




గోదాదేవి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నంబావి,జనవరి 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దదగడ, చిన్న మారూర్ గ్రామాలలో భోగిపండగ సందర్భంగా పురాతన ఆల యాలైన శ్రీ పద్మావతి సమేత తిరుమలనాథస్వామి, శ్రీ లక్ష్మి చెన్నకే శవస్వామి ఆలయల్లో భోగి పండగను పురస్కరించుకుని శ్రీ గోదాదేవి కళ్యాణోత్స వం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ ఉత్స వం సందర్భంగా నిత్యవిధి, తీర్థ ప్రసాద గోష్టి, అన్నల్ నీరాట్టోత్స వం, మహదాశీర్వాదం అనంతరం అన్నదానం మొదలగు కార్యక్రమాలనుఘనంగా నిర్వహించారు. గోదాదేవి కళ్యాణోత్స వం తిలకించిన భక్తుల కు అవివాహితులకు, వైవాహిక జీవితంలో సమస్యలు, సంతాన ఆర్థిక తదితర సమస్యలు ఉన్నవారు గోదా అమ్మవారి కార్యక్రమం లో పాల్గొన్న భక్తులకు మంచి జరుగుతుందని ఉత్పల నరసింహా చార్యులు తెలిపారు. అలాగే చిన్న మారూర్ గ్రామంలోని శ్రీ చెన్నకేశ వస్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి కళ్యాణోత్స వ కార్యక్రమాన్ని వివిధ గ్రామా లభక్తులు విచ్చేసితిలకించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాంతికుమార్‌కు ఎంపి సీటు కేటాయించాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి14 ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నిక్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బండారి శాంతికుమార్‌కు అవకాశం ఇవ్వాలని జడ్చర్ల నియోజకవర్గ బిసి విద్యార్థి సంఘంఅధ్యక్షుడు శివకుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు ఎంపి అభ్యర్థిగా బిసి సామాజిక వర్గానికి చెందినవారికి కేటాయించాలని అన్ని పార్టీలను డిమాండ్ చేస్తూ, ముఖ్యంగా బిజెపి పార్టీపై తమకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని, ఎందుకంటే పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ బిసి అభ్యర్థిని సీఎంగా చేస్తామని చెప్పింది. అందులో భాగంగా రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు అభ్యర్థిగా రెండుసార్లు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థుల కోసం బిసిఅభ్యర్థికి అన్యాయం చేశారు. కావున ఈ సారి బిజెపి పార్టీ, బిసి సామాజిక వర్గానికి చెందిన బండారి శాంతికుమార్‌కు ఎంపి టికెట్ కేటాయిస్తుందని, మేము నమ్ముతున్నామని ఆయన అన్నారు. బిసి నాయకుడైన బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్, ఎంపి పదవికి ముమ్మాటికి అర్హుడైన వ్యక్తి. గత రెండు పార్లమెంట్ ఎన్నికలలో చివరి క్షణంలో శాంతికుమార్‌కు కేటాయించిన ఎంపి సీటును పార్టీ ఆదేశాల మేరకు త్యాగం చేశారు. 2014 ఎన్నికల్లో అప్పుడే పార్టీలో చేరిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాగం జనార్ధన్‌రెడ్డి కోసం 2019 ఎన్నికల్లో అప్పటికప్పుడు పార్టీలో చేరిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన డికె అరుణ కోసం శాంతికుమార్ పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తూ పోటీకి దూరంగా ఉన్నారు. కాబట్టి పార్టీ హైకమాండ్ కూడా ఈ విషయంలో శాంతికుమార్‌కు న్యాయం చేయాలని కోరుతున్నాను. మొన్నటి ఎన్నికల్లో బిసి సీఎం అని ప్రకటించిన పార్టీ ఎంపి ఎన్నిక్లో బిసి జనాభా ఎక్కువ ఉన్న పాలమూరు పార్లమెంట్ సీట్ బిసిలకు కేటాయించి తమమాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి నాయకులు ప్రవీణ్, నాని తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మెల్విన్‌జోన్స్ జయంతి



**నారాయణపేట ప్రతినిధి, జనవరి14 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్‌జోన్స్ జయంతి సందర్భంగా లయన్ బి. అంబదాస్‌రావు అధ్యక్షతన లయన్ సత్యాంజనేయులు, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ సహకారంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్. రమేష్‌రావు, రీజియన్ ఛైర్మన్ మాట్లాడుతూ మెల్విన్ జోన్స్ ఒక వ్యాపారవేత్త ఎంత సంపాదించిన జీవితంలో సంతృప్తి అనేది ఉండదని భావించి తాను సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవకు వినియోగించాలన్న ఆలోచనతో తనలాంటి కొంతమంది వ్యాపారస్తులు కలిసి సమాజసేవ చేయడం ప్రారంభించి చివరకు 7 జూన్ 1917వ సంవత్సరంలో లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థగా ఏర్పాటు కావడం జరిగింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలలో 48 వేల క్లబ్బులతో 1.4 మిలియన్ల సభ్యులతో విస్తరించి ఉన్నదని భారతదేశంలో 6,335 క్లబ్బులతో 2,35,000 సభ్యులను కలిగి స్వచ్ఛందంగా అనేక సేవలను అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో డా. శరణ్య, ప్రభుత్వ వైద్యులు కె. శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ కర్నిస్వామి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ డివిచారి, డిస్ట్రిక్ట్ ఛైర్ పర్సన్ పృథ్వీరాజ్, జాయింట్ సెక్రెటరీ ఆడం సత్యనారాయణ, కట్ట వెంకటేష్, జి. శరణప్ప, కె. రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**మాగనూరు, జనవరి14 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా కబడ్డి పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డివిఐఎఫ్ఐ ఆధ్వ ర్యంలో ఈ కబడ్డి పోటీలు ప్రారంభించడానికి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మండల నాయకులు నరేష్‌కుమార్, సిపిఎం పార్టీ జిల్లా మెంబర్ ఆంజనేయులు, భరత్‌కుమార్, రాఘవేంద్ర, మాగనూరు సర్పంచ్ రాజు, మాజీ జడ్పీటిసి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## వైభవంగా గోదాదేవి కళ్యాణం



**చిన్నచింతకుంట, జనవరి 14 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ గోదాదేవి కళ్యాణం వేద పండితులు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిపించారు. ధనుర్మాసం పూజల్లో భాగంగా స్వామివారి ప్రధానాలయంలో శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ కురుమతిస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద పండితులు శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు శ్రీ గోదాదేవి కళ్యాణం కన్నుల పండువగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అలంపూర్ ఎమ్మెల్యేకు ఘన సన్మానం



కొత్తకోటలో అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడుని సన్మానిస్తున్న నాయకులు

**కొత్తకోట, జనవరి 14, ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణం కేంద్రంలోని మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్, నివాసంలో ఆదివారం అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడుని ఎంపీపీ గుంత మౌనిక శాలువతో పూల మలాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి విశ్వేశ్వర్, మండల కోఆప్షన్ సభ్యులు అల్లా భాష, సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, సింగిల్ విండో డైరెక్టర్ చాపల భాస్కర్, మాజీ ఎంపీటీసీ సంజీవులు, నాయకులుకృష్ణయ్యగౌడ్, వినోద్ సాగర్, అంజి పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, జనవరి 14, ప్రభాతవార్త:** నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో కళకళలాడుతూ ఉండాలని ఆయన కోరారు.

## అంబులెన్స్‌లో కవల పిల్లలకు జన్మనిచ్చిన తల్లి

**అమరచింత, జనవరి 14, ప్రభాతవార్త:** అమరచింత పట్టణానికి చెందిన అంజనమ్మ పురిటి నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిఎంఆర్ ప్రభుత్వ వైద్యులు ఆమెను పరీక్షించిన అనంతరం అంజనమ్మకు పురిటి నొప్పులు ఎక్కువ ఉండడం వల్ల డిఎంఆర్ ప్రభుత్వ వైద్యుల సూచన మేరకు వనపర్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో వనపర్తికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అంజనమ్మకు పురిటీ నొప్పులు ఎక్కువ అవ్వడంతో 108 టెక్నీషియన్ మశోద, పైలట్ యోగేశ్వర్ అంబులెన్స్ లోనే వైద్య సేవలు అందించి అంజనమ్మ ప్రసం చేశారు. అంజనమ్మకు ఇద్దరూ కవల ఆడపల్లలకు జన్మనిచ్చారు. అనంతరం 108 సిబ్బంది. వనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు కల్పించారు. ఇద్దరి కవల పిల్లలకు జన్మనిచ్చిన తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని వైద్య సిబ్బంది తెలిపారు.



# గ్రామ పంచాయతీ వర్కర్స్ రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయండి

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 14 ప్రభాతవార్త:** మక్తల్ మండల గ్రామ పంచాయతీ కార్మికుల మండల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఈ సభకు మండల అధ్యక్షులు నర్సింహ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తలుగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కిరణ్, వక్తలు గా తెలంగాణ ప్రగతిశీల వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు అను బంధం) జిల్లా అధ్యక్షులు ఎదిరింటి నర్సింలు, తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ (ఐఎఫ్‌టియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి రాము హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభలు జనవరి 28న వనపర్తి జిల్లా కేంద్రంలో ఉంటున్నాయి. ఈ సందర్భంగా జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది మొత్తాన్ని వెంటనే పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిఓ నం.50 ను రద్దు చేయాలని పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుయిటీ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్ రంగంలో పని చేస్తున్న కార్మిక వర్గానికి భీమా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రమాదం, అనారోగ్యం వల్ల వందల మంది చనిపోయిన గ్రామ పంచాయతీ వర్కర్లకు నేటికి భీమా



పాల్గొన్న గ్రామ పంచాయతీ వర్కర్స్



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. వెంటనే గ్రామ పంచాయతీ వర్కర్స్ గత పది సంవత్సరాలుగా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ సతమతమవుతున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం సంఘటితంగా ఐక్యంగా పోరాడాలని, వివిధ కార్మిక సంఘాల రాజకీయ లక్ష్యాలను అర్థం చేసుకుని నిజమైన కార్మికవర్గం దృక్పథం కలిగి ఉండాలన్నారు. నిరంతరం ఈ మండలంలో అనేక పోరాటాలు నిర్వహించిన ఐఎఫ్‌టియు కార్మిక సంఘం వెంట గ్రామ పంచాయతీ కార్మికులందరూ ఉండాలని కోరారు. గత సంవత్సరం 34 రోజులు కార్మికులు సమ్మె చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం స్పందించలేదు. సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు చేసిన ఎంతో నిబ్బరంగా ఓర్పుతో కార్మికవర్గం పోరాడిందన్నారు. అదే స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. 34 రోజులు సమ్మె చేస్తున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మండల కార్యదర్శి నరేష్, వెంకటేష్, చెన్నయ్య, నర్సింహ, వెంకటేష్, ఆంజనేయులు, అంజమ్మ, నారాయణ పాల్గొన్నారు.

## విద్యార్థి దినేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

**వనపర్తి టౌన్, జనవరి 14, ప్రభాతవార్త:** అమెరికాలో మరణించిన తల్లిదండ్రులను ఓదార్చిన మాజీ మంత్రి. పార్థివ దేహాన్ని రప్పించడానికి కృషి చేస్తానని హామీ. ఫోన్ ద్వారా రావుల చంద్రశేఖరరెడ్డి పరామర్శ. గట్టు. వెంకన్న లావణ్య దంపతుల ఎకైక కుమారుడు గట్టు. దినేష్ ఉన్నత చదువుల కోసం యునైటెడ్ స్టేట్స్ వెళ్లారు. వెళ్లిన 15 రోజుల వ్యవధిలోనే అనుమానస్పదంగా మరణించినట్లు సమాచారం వచ్చింది. ఈ విషయము తెలిసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గట్టు. వెంకన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎదిగి వచ్చిన కొడుకును కోల్పోవడం చాలా దురదృష్టం అని అన్నారు. ధైర్యంగా ఉండాలని ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రావుల పరామర్శ గట్టు. వెంకన్న రావుల చంద్రశేఖర రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. నాకు అత్యంత సన్నిహిత కుటుంబములో విషాదం జరగడం దురదృష్టకరం అని అన్నారు. ఆ భగవంతుడు వారికి మనోధైర్యం ఇవ్వాలని అన్నారు. నిరంజన్ రెడ్డి వెంట చైర్మెన్ గట్టు యాదవ్ మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్ నాయకులు కంచె. రవి, ప్రేమ్ నాథ్ రెడ్డి, చంద్రశేఖర్, ఐ.ఐ.సి కృష్ణ, జాత్రూ, చిట్యాల. రాము, అనపటి. రాము, మంద, రాము, ముద్దుసార్ ఉనానరు. బాధిత కుటుంబాలకు నిరంజన్ రెడ్డి పరామర్శ ప్రముఖ వైద్యులు డాక్టర్. చల్మా రెడ్డి ఇటీవల సస్వస్థతకు గురయ్యారు. వారిని కలసి పరామర్శించి పేద ప్రజలకు సేవ చేయుటకు మీరు ఆయురారోగ్యాలతో వుండాలని అన్నారు. మెట్టుపల్లి గ్రామానికి చెందిన రంగం. రాములు మరణించారు. వారి తల్లి రంగం. సాయమ్మ మాజీ కౌన్సిలర్ కలసి పరామర్శించారు. నిరంజన్ రెడ్డి వెంట కంచె. రవి, చెన్న రాములు, బీరయ్య, నందిమల్ల. కిరణ్ ఉన్నారు.



గట్టు దినేష్ కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## మాజీ ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించిన నాయకులు

### -అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుని ఏకాదశ దినకర్మకు హాజరైన కేటీఆర్, ఎంపి మన్నె, మాజీ మంత్రులు

**భూత్పూర్, జనవరి 14, ప్రభాతవార్త:** భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఆదివారం భూత్పూర్ మండలంలోని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం అన్నాసాగర్‌కు వచ్చారు. ఆల సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి ఏకాదశ దినకర్మ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నివాసంలో స్వర్గీయ ఆల శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆల కుటుంబీకులను పరామర్శించి శశివర్ధన్‌రెడ్డి మృతిపట్ల తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో భోజనం చేశారు. కేటీఆర్ వెంట మహబూబ్‌నగర్ ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ మంత్రులు డాక్టర్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, పిచంద్రశేఖర్, మాజీ ఎంపి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వలబాల్‌రాజ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి,, చిట్టెం రాంమ్మోహన్‌రెడ్డి, విజయుడు, సయ్యద్ ఇబ్రహీం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపూర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులతో పాటు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఇతర ప్రజాప్రతినిధులు ఉమ్మడి జిల్లాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఆల శశివర్ధన్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



అన్నాసాగర్‌లో మాజీలతో ఎమ్మెల్యే కేటీఆర్ మాటా ముచ్చట



మాజీ ఎమ్మెల్యే ఆల కుటుంబీకులను, ఆల మాతృమూర్తిని ఓదారుస్తున్న కేటీఆర్

## అలంపూర్ నియోజకవర్గంలో 3 గురుకుల పాఠశాలు ఏర్పాటు చేయాలి

### జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పుటాన్ దొడ్డి మంద జగన్నాథం



**ఇటిక్యాల జనవరి14 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు, అలంపూర్, బాలికల గురుకుల పాఠశాలలు అలాగే అయిజ మండలానికి చెందిన బాలుర గురుకుల పాఠశాలను గత ప్రభుత్వంలో నియోజకవర్గం కాకుండా గద్వాల నియోజకవర్గంలోని 50 నుండి 80 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారని తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వెళ్లలంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని దూర ప్రాంత గ్రామాల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తుందని అలంపూరు నియోజకవర్గానికి కేటాయించిన అలంపూర్ మానవపాడు అయిజ మండలగురుకుల పాఠశాలలను ఆ మండల కేంద్రాల్లో నే ఏర్పాటు చేసేలా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అలంపూరు ఎమ్మెల్యే విజయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పుటాన్ దొడ్డి మంద జగన్నాథం డిమాండు చేశారు. అయిజ మండలానికి చెందిన బాలుర గురుకుల పాఠశాలను రవళి చౌరస్తాలోని ప్రైవేట్ స్కూల్ భవనంలో ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని ఈ పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులు చూసేందుకు వెళ్లాలంటే 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని జూన్ నెలలో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరంలో నైనా 3 గురుకుల పాఠశాలలను అలంపూరు నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు విద్యార్థులకు విద్యార్థినిలకు న్యాయం చేయాలని ఆ దిశగా ఎమ్మెల్సీ చల్లా వెంకట రామిరెడ్డి అలంపూరు ఎమ్మెల్యే విజయుడు ప్రత్యేక చొరవ తీసుకుని నియోజకవర్గ ప్రజలకున్యాయం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుటాన్ దొడ్డి మంద జగన్నాథం కోరారు.

## వావిలాలలో భజన పోటీలు

**ఇటిక్యాల జనవరి 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వావిలాల గ్రామంలో వెలసిన శ్రీ శివాంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం భజన పోటీలను ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో సాయంత్రం ప్రారంభించారు. పోటీలలో 17 భజన మండలి భక్తులు పాల్గొన్నారు. పోటీలు తెల్లవారుజాము కొనసాగుతుండగా గెలుపొందిన వారికి శివాంజనేయ కమిటీ ఆధ్వర్యంలో 8 మంది విజేతలకు 20 వేలనుండి ఒక వెయ్యి రూపాయల వరకు బహుమతులను అందివ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## ఎమ్మెల్యే జీఎంఆర్‌కు సన్మానం

**కొత్తకోట, జనవరి 14, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం 11వ వార్డు ఇన్చార్జి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ జెఎం మీషేక్ దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి మధుసూదన్‌రెడ్డికి, వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వారి నివాసంలో కలుసుకొని మర్యాదపూర్వకంగా శాలువతో ఘనంగా సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయన సతీ మణికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షతుల తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆరు గ్యారెంటీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేసే విధానంలో మీ పాత్ర ఉండాలని కోరారు.



## అయోధ్య వరకు మోటార్ బైక్ యాత్ర

### విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భక్తులకు సన్మానం



అయోధ్య వరకు మోటార్ బైక్ యాత్రగా వెళ్తున్న వారిని సన్మానించిన దృశ్యం

**మక్తల్, జనవరి14 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు గావించి అనంతం మక్తల మండలం సత్యవార్ గ్రామానికి చెందిన గుండ్లకుంట నారాయణ, చంద్రకాంత్ ఇద్దరు భక్తులు ఈనెల 22న అయోధ్యలో పున: ప్రతిష్టాపన జరుగుతున్న మందిర నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనడానికి మోటార్ బైక్‌యాత్ర ద్వారా మక్తల్ నుండి అయోధ్యకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారిని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అయోధ్యకు పంపంచారు. కార్యక్రమంలో సంఘ పరివార సంస్థల సభ్యులు కర్నిస్వామి, కావలి వెంకటేష్, వి. భీంరెడ్డి, వాకిటి శేషగిరి, ప్రభాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు తులసప్ప, వాకిటి రమేష్, పసుపుల భీమేష్, భాస్కర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులు, రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**పెబ్బేరు, జనవరి 14, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా మాజీ సర్పంచు అక్కి సుశీల నేతృత్వంలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ముగ్గులను పరిశీలించారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ముగ్గుల పోటీలలో మొదటి విజేతగా సుమిత్ర, చంద్రకళ రెండో విజేతగా భాగ్యలక్ష్మి, సుజాత మూడో విజేతగా నిహారిక, కావ్య నాలుగో విజేతగా మన్యమ్మ, రాథ ఐదవ విజేతగా అలివేలమ్మ, శిరీషలు గెలుపొందించారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను ప్రధానం, చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ సాగర్, గంధం రాజు, కొంతం దయాకర్‌రెడ్డి, గంధం రంజిత్ కుమార్, జగదీష్ రెడ్డి, రాములు యాదవ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, సునీలు, సర్వేశ్, షకీల్, శివ సాయి, జాంగిర్, సాయి గౌడ్, రాములు పాల్గొన్నారు.

## మక్తల్ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి



**అమరచింత, జనవరి 14, ప్రభాతవార్త:** నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కే విజయ రాములు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మక్తల్ లో ఆయనను శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో విజయం పై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయరాములు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్త పొత్తులో భాగంగా మక్తల్ నియోజకవర్గంలో సిపిఐకి సహాయ సహకారాలు అందించాలని కోరామని, ఆయన వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల కోసం విన్నపాలు, తప్పని పరిస్థితి అయితే పోరాటాలు తప్పమన్నారు. సిపిఐ ఎల్లప్పుడు ప్రజల గొంతుక గా నిలుస్తుంది అన్నారు. ఆరోగ్యారెంటీలను ప్రజలకు అందజేసేందుకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలో లేని రేషన్ కార్డులకు జిల్లాలో రాష్ట్రంలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయని కొత్త రేషన్ కార్డులు, అర్హులకు పింఛన్లు, సాగునీరు, రోడ్లు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుమోష, భాస్కర్, నరసింహ శెట్టి, మల్లేష్, కుతుబ్ పాల్గొన్నారు.

## బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే



**అలంపూర్ జనవరి14 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం అష్టాదశ శక్తి పీఠల్లో ఒకటైన ఐదవ శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ, తదితరులు ఉన్నారు.

## కోదండ రామాలయంలో గోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం

**ఇటిక్యాల జనవరి14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని కృష్ణానది సమీపాన వెలసిన కోదండరామస్వామి ఆలయంలో ధను ర్మాస మహోత్సవాలలో కోదండరామ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవం కార్యక్రమంలో భాగంగా ధనుర్మాసం చివరి రోజు ఆదివారం గోదా రంగనాథ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవాన్ని వల్లూరు గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి జ్ఞాపకార్థము వారి మనువళ్లు మనువరాళ్లు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జరిపించారు. అదే విధంగా కళ్యాణానికి వచ్చిన భక్తులకు మరియు దేవాలయమునకు వచ్చిన భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం వల్లూరు గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి మనువళ్లు నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు.



# వైభవంగ గోదాదేవి కళ్యాణోత్సవం

**బిజినేపల్లి, జనవరి14 ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగంగా వట్టె శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ గోదాదేవి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు కారంపూడి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం గోదాదేవి కళ్యాణోత్సవాన్ని అత్యంత రమణీయంగా, కమనీయంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వందలాది మంది దంపతులు పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్‌రెడ్డి దంపతులు ప్రత్యేకంగా హాజరై కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు సందడి దేవేందర్‌రెడ్డి, సందడి సురెందర్‌రెడ్డి దంపతులు, అనంత నరసింహారెడ్డి, వాసా ఈశ్వరయ్య, చంద్రారెడ్డి, గుబ్బ సత్యం, రాజశేఖర్, జక్‌పాల్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకటనారాయణ, రామకృష్ణ, అనురాధ, రామ తేజ తదితరులు పెద్ద సంఖ్యలో ఈ ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ ఘట్టాన్ని ప్రధాన అర్చకులు ప్రత్యేక వ్యాఖ్యానంతో వివరించారు. వట్టెం బాలికలు, మహిళల బృందం కోలాట నృత్య ప్రదర్శన, భజనలు ఆహుతులను ఆకర్షించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసినటువంటి భక్తాదులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. కళ్యాణోత్సవం అనంతరం అందరికి అన్నప్రసాద వితరణ జరిపారు. భక్తుల తన్మయత్వంతో ఆలయం ఆధ్యాత్మికతను సంతరించుకుంది

**పాలెం శ్రీవెంకటేశ్వర ఆలయంలో:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాలెం శ్రీ వెంకటేశ్వర ఆలయం బిజినేపల్లి ఆనందగిరి లక్ష్మి వెంటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించరు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి కళ్యాణోత్సవం గోదాదేవి కళ్యాణ మహోస్సవాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య కళ్యాణం కమనీయం అన్నట్లుగా ఆద్యంతం భక్తిభావంతో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో ఆలయ కమిటి ఛైర్మన్ జున్ను శేఖర్‌రెడ్డి, సభ్యులు, మాజీ సర్పంచ్ గంగనమోని తిరుపతయ్య, కె. తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కావలి నిరంజన్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**చిన్నంబావిలో:** మండల పరిధిలోని పెద్దదగడ, చిన్నమారూర్ గ్రామాలలో భోగిపండగ సందర్భంగా పురాతన ఆలయాలైన శ్రీ పద్మావతి సమేత తిరుమలనాథస్వామి, శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయల్లో భోగి పండగను పురస్కరించుకుని శ్రీ గోదాదేవి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ ఉత్సవం సందర్భంగా నిత్యవిధి, తీర్థ ప్రసాద గోష్టి, అన్నల్ నీరాట్టోత్సవం, మహదాశీర్వాదం అనంతరం అన్నదానం మొదలగు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గోదాదేవి కళ్యాణోత్సవం తిలకించిన భక్తులకు అవివాహితులకు, వైవాహిక జీవితంలో



గోదాదేవి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు



సమస్యలు, సంతాన ఆర్థిక తదితర సమస్యలు ఉన్నవారు గోదా అమ్మవారి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకుమంచిజరుగుతుందనిఉత్పల నరసింహాచార్యులు తెలిపారు. చిన్నమా రూర్ గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని వివిధ గ్రామాల భక్తులు విచ్చేసి తిలకించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



బిజినేపల్లి వెంకటేశ్వ ఆలయంలో గోదాదేవి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



గోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## కన్నుల పండువగా గోదారంగనాథ స్వామి కళ్యాణోత్సవం



స్వామి వారి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 14 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో అతి పురాతనమైన వైష్ణవ ఆలయాల్లో ప్రాముఖ్యతను సంతరించుకున్నటువంటి నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురంలో వెలిసిన శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో గోదా కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారి కళ్యాణోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించి ఎమ్మెల్యే దంపతులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. నెల రోజుల పాటు ఆలయంలో నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ వేడుకను నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త రంగాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి గోదా కళ్యాణాన్ని వీక్షించి పునీతలయ్యారు. గోదా కళ్యాణం సందర్భంగా గోవిందా నామస్మరణతో ఆలయం మారుమోగింది. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కల్పనతో పాటు భక్తులు తదితరులు ఉన్నారు.

## ఐక్యత ఫౌండేషన్, యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో భోగి సంబురాలు



**కల్వకుర్తి, జనవరి 14 ప్రభాతవార్త:** ఐక్యత ఫౌండేషన్, యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో సంక్రాంతి పర్వదినాల సందర్భంగా భోగి మంటల కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే పెద్ద ఎత్తున ఆడపడుచులందరు ముత్యాల ముగ్గులు వేసి భోగి మంటలు వేశారు. భోగి మంటల చుట్టు ఆహ్లాదకరంగా దాండియా నృత్యాలు చేస్తూ భోగి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పారస్థారతి, మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు, పట్టణ ప్రజలు, యూత్ ఫర్ సేవా వాలంటీర్లు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## 10 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టుకున్న పోలీసులు



**నారాయణపేట ప్రతినిధి, జనవరి 14 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్డులో ఒక ఇంట్లో అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హనుమంతు అనే వ్యక్తి చుట్టపక్క ఇళ్లనుండి పిడిఎస్ రైస్ సేకరించి నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు నారాయణపేట పోలీసులు దాడులు నిర్వహిచి 20 బ్యాగులు, సుమారు 10 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టుకుని డిటి పంచనామా అనంతరం హనుమంతుపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

# క్రీడలతో శారీరక,మానసిక ఆరోగ్యం

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**పానగల్, జనవరి 14, ప్రభాతవార్త:** క్రీడలు శారీరక,మానసిక వికాసానికి దోహదపడుతాయని,తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎక్సైజ్ ,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.ఆదివారం పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామంలో నేషనల్ లెవల్ మహిళ,పురుషుల నెట్ వాలీబాల్ చాంపియన్ షిప్ టోర్నీని మంత్రి జూపల్లి ప్రారంభించారు.క్రీడాకారుణీలను పరిచయ కార్యక్రమంలో పాల్గొని,వారితో కలిసి కాసేపు వాలీబాల్ ఆడి ఉత్సాహం నింపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..మారిన సమాజంతో పాటు క్రీడా పోటీల్లో పాల్గొనే వారి సంఖ్య తగ్గిపోయి,సెల్‌ఫోన్‌లకు అత్తుకుపోయి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆహారపు అలవాట్లు మారిపోవడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తు



క్రీడాకారులతో మంత్రి జూపల్లి



క్రీడలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

తున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆరోగ్యాలను కాపాడుకునేందుకు క్రీడలు,వాకింగ్,వ్యాయామం తదితరాలు అలవర్చుకోవాలని సూచించారు.ఆరోగ్యంగా ఉంటే దేన్నైనా సాధించవచ్చు అని తెలిపారు.ఫిట్నెస్ చెప్పడంతో సభలో నవ్వులు విరిసాయి. మరోవైపు యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని,అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు.క్రీడాకారులు ఆటల పోటీల్లో పాల్గొని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు మాజీ జెడ్పిటిసి రవికుమార్ సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ ముంత భాస్కర్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్ సాగర్ బ్రహ్మయ్య విష్ణు ఎస్ఎంసి ఛైర్మన్ మల్లేష్ శ్రీనివాస్‌రెడ్డి వెంకటయ్య బీరయ్య పాల్గొన్నారు.

# వాసవీక్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**కల్వకుర్తి, జనవరి 14 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీక్లబ్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కల్వ హరికృష్ణ, ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు వాసవీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వాసవీక్లబ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కలిమిచెర్ల రమేష్, శివ, జగదీశ్వర్, గంప శ్రీనివాసులు, గుగ్గిళ్ల శంకర్, దాచేపల్లి మనోహర్, కలిమిచెర్ల గోపాల్, జూలూరి సత్యనారాయణ, చిదిరే శ్రీనివాసులు, కల్వ



వాసవీక్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆంజనేయులు,కల్వ లక్ష్మి, భీమ్‌శెట్టి ప్రసన్న, వీరబొమ్ము విజయ్‌భాస్కర్, పాపిశెట్టి సతీష్‌గుప్త, యాద శోభన్‌బాబు, బిల్లకంటి వెంకటేశ్వర్లు, ఉప్పు ఆంజనేయులు, గుండ్ల శ్రీనివాసులు, పీఎస్ఎన్‌గప్త, గుబ్బ కిషన్, సామల రాజేష్ తదితరులు ఉన్నారు.

# మద్దిగట్లలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

-పాల్గొన్న అన్ని పార్టీల నేతలు..

-విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన ఎంపిపి

**భూత్పూర్, జనవరి 14, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం మద్దిగట్లలో గతేడాది మాదిరిగానే ఈ ఏడాది పార్టీల కతీతంగా అన్ని పార్టీల నేతలు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు, బాలికలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు.రంగురంగుల రంగవల్లులతో మద్దిగట్లలో సంక్రాంతి శోభ నెలకొంది.ముగ్గుల పోటీల్లో విజేతలకు నగదుతో పాటు పురస్కారాలు అందజేశారు.మొదటి విజేతకు ఎంపి కదిరే శేఖర్‌రెడ్డి గ్రామం తరఫున రు.2116ల నగదు పురస్కారాన్ని విజేతగా నిలిచిన కమ్మరి రజితకు అందజేయగా,ద్వితీయ,తృతీయ నగదు బహుమతుల్ని గ్రామ శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయ నిర్వహకులు,మండల కాంగ్రెసఅధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు.ద్వితీయ బహుమతిని కమ్మరి హర్షిత,తృతీయ బహుమతిని రామకృష్ణ కూతురు వర్ణిక గెలుపొందారు.మద్దిగట్లలోనిర్వహించిన సంక్రాంతి సంబరాలు,ముగ్గుల పోటీలు పార్టీలకతీతంగా అన్ని పార్టీల నేతలు పాల్గొని గ్రామ సామరస్యాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి(బీఆర్ఎస్),కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(కాంగ్రెస్), రవీందర్‌రెడ్డి(బీజేపీ)లతో పాటు గ్రామ సర్పంచి ప్రియాంక ఓంకార్‌రెడి నాయకులు నర్సింహ్మారెడ్డి,మాజీ సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ రామ్‌రెడ్డి,బత్తిని కాంతారెడ్డి పిట్టల శేఖర్,ఖానాపురం శివ,భాస్కర్‌రెడ్డి , మెరుగు చెన్నయ్య,అంజనేయులు,మన్నెంతోపాటు పలు పార్టీల కార్యకర్తలు, గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.



మద్దిగట్లలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



బహుమతులు పంచిపెడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,రవీందర్‌రెడ్డి



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి



## అయోధ్య రాముని అక్షితల పంపిణీ

**భూత్పూర్, జనవరి 14, ప్రభాతవార్త :** అయోధ్య రాముని అక్షితలను ఆదివారం భూత్పూర్ మండలం శేరుపల్లి(హెచ్) గ్రామంలో విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ప్రకండ అధ్యక్షుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో నాయకులు,భజన బృందం సభ్యులు,గ్రామ పెద్దలు తాళమేళాలతో అక్షితలను ఇంటింటికి పంపిణీ చేశారు.ఆయోధ్య రాముని విగ్రహ స్థాపన ఈ నెల 22న ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రధాని మోడీ చేతుల మీదుగా నిర్వహిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా వీహెచ్‌పీ,భజన బృందాలు ఊరూరా రాముని అక్షితలను పంపిణీ చేస్తున్నారు.శేరుపల్లిలో జరిగిన అక్షితల వితరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బోల శేఖర్,ఉపసర్పంచి యాదగిరి,భజన మండలి అధ్యక్షుడు అయోధ్య గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి,నారాయణరెడ్డి,అంజనేయులు,ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

## సాహసం కనబర్చిన వారిని అభినందించిన పానగల్ ఎస్సై

**పానగల్, జనవరి 14, ప్రభాతవార్త :** ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికి పాన్‌గల్ ఎస్సై వేణు అభినందించారు ఇటీవల రేమద్దుల గ్రామంలో బావిలో పడి మృతి చెందిన వ్యక్తిని బయటికి తీయడంలో ధైర్యాన్ని ప్రదర్శించిన రేముద్దుల గ్రామానికి చెందిన అన్నె రమేష్ తో పాటు, బండపల్లి స్టేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని తరలించడంలో సహకరించిన వెంగళ్లాయి పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సాయి కుమార్ లను పాన్‌గల్ ఎస్సై వేణు అభినందిస్తూ పోలీస్ స్టేషన్లో వారిని శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా మనకెందుకు లే అనుకోకుండా సహకరించే తత్వం అలవర్చుకోవాలని,సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



**కల్వకుర్తి, జనవరి 14 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీఉప్పల వెంకటేష్ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, నిరాశ్రయులకు పండ్లు, బ్రెడ్లను ఉప్పల ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్, పూరి రమేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, గంగాధర్, కృష్ణ, గణేష్, పురుషోత్తం, రవి, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

## శ్రీశ్రీశ్రీ క్షీరలింగేశ్వరస్వామి రథోత్సవం



ఎమ్మెల్యేను సన్మానించి ఆలయ కమిటీ సభ్యులు

**కృష్ణ, జనవరి 14 ప్రభాతవార్త :** మండలంలో ప్రసిద్ధి గాంచిన శ్రీశ్రీశ్రీ క్షీరలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. అనంతరం రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కొత్తకోట సిద్ధార్థరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కృష్ణ, మాగనూరు మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మీ శ్రేయోభిలాషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చర్చికి మైక్‌సెట్ వితరణ



మాట్లాడుతున్న మీ శ్రేయోభిలాషి ఫౌండేషన్ డైరెక్టర్ పెరుమాళ్ళ శ్రీనివాస్



**చిన్నంబావి, జనవరి 14 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్న క్రీస్తు సంఘం చర్చికి నూతన సంవత్సరం సందర్భంగా పాస్టర్ యాకోబు కోరిక మేరకు ఇచ్చిన మాట ప్రకారం మీ శ్రేయోభిలాషి ఫౌండేషన్ డైరెక్టర్ పెరుమాళ్ళ శ్రీనివాస్ మైక్‌సెట్ అందించి మాట నిలబెట్టుకున్నారు. ఆదివారం పాస్టర్ యాకోబు ఆధ్వర్యంలో చర్చి నిర్వాహకులు ఇసాక్, శాంసన్‌లకు మైక్‌సెట్‌ను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీస్తుసంఘం పట్ల శ్రీనివాస్ ప్రేమాభిమానాలు ఎల్లవేళలా ఉండాలని ఏసుక్రీస్తు వారికి ఆయుష్షు, ఆరోగ్యం కలిగించే విధంగా ఆ దేవుడు వారిపై కరుణ, ప్రేమ, అన్నింటిలో విజయాలను చేకూర్చాలని వేడుకున్నానని తెలిపారు. పెరుమాళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ పనియే ప్రత్యక్ష దైవమని ప్రతి ఒక్కరు కష్టించి పని చేస్తే వారిపట్ల భగవంతుని కృప ఎల్లవేళలా ఉంటుందని దేవునిపై నమ్మకంతో పనిచేస్తే ప్రతి ఒక్కరికి ఆయన ఆశీస్సులతో అభివృద్ధికి వస్తారని అన్నారు. క్రీస్తు సంఘం చర్చికి తన సహాయ, సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ యాకోబు, అబ్రహాం, ఇసాక్, శాంసన్, శేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కొల్లాపూర్, జనవరి 14 ప్రభాతవార్త :** పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోలు గ్రామ సర్పంచ్ ఎస్‌కె ఖాజా మాతృమూర్తి బసిరాబీ ఆరోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు రంగినేని అభిలాష్ రావులు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సర్పంచ్ ఎస్‌కె ఖాజా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వార్త

నీలో ఉన్న శక్తిని నీవు తెలుసుకున్నప్పుడే గమ్యం చేరగలవు. కనుక ముందు నీ గురించి నీవే పరిశోధించుకో.

-రామకృష్ణ పరమహంస

# అనుకూలించని దౌత్యబంధం


అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన ప్రజాస్వామ్య దేశంగా భాసిల్లుతున్న భారత్ అంటే ఇప్పుడు ఇరుగుపొరుగు దేశాలకే కాదు ద్వీపకల్ప దేశాలకు సైతం అక్కసు పెరిగిపోతోంది. ఈర్ష్య అనుకోవాలో, లేక ఎదిగిపోతున్నదన్న దుగ్ధ అనుకోవాలో తెలియదు కానీ పొరుగుననే ఉన్న పాకిస్థాన్‌నుంచి ఆసియాలోని అగ్రరాజ్యం చైనా దగ్గర్నుంచి అన్నింటికీ కూడా భారత్ కంటిలో నలుసే. తాజాగా భారత ప్రధాని లక్షద్వీప్ పర్యటనపై మాల్దీవుల మంత్రులు నోరుపారేసుకోవడం ఈకోవలోకే వస్తుంది. చిన్న దేశం అయినా ద్వీపకల్పం ప్రత్యేకించి పర్యాటకరంగంపైనే ప్రధాన ఆదాయ వనరుగా కొనసాగుతున్న దేశం. ఒక్క భారత్ నుంచే సాలీనా నాలుగైదు లక్షల మంది పర్యాటకులు వెళుతుంటారు. భారతీయులు పరిశుభ్రత పాటించరని ఆ చిన్న దేశం మంత్రులు చేసిన వ్యాఖ్యలకు వారు భారీ మూల్యమే చెల్లించుకున్నారు. వెంటనే వారిని సస్పెండ్ చేయడం కూడా జరిగింది. ఓపక్క లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ సైతం మా ద్వీపంలో మా ప్రధాని పర్యటిస్తే మీకేంటి నొప్పి అని ఘాటుగానే స్పందించినా మాల్దీవులు మాత్రం తన దౌత్యబంధాన్ని తెంచేసుకునే దిశలోనే వెళుతోంది. వాస్తవానికి ఆ దేశంలో గత ఎన్నికల నుంచీ కూడా భారత్‌పై అధికార పార్టీకి గుర్రుగానే ఉంది. ప్రత్యేకించి ఈ దీవుల్లో భారత మిలిటరీ స్థావరాలు సుదీర్ఘకాలం కొనసాగడంపైనే ఆదేశానికి సుతరాము నచ్చడంలేదు. తమ దేశసార్వభౌమ త్వంపై ఇతర దేశాల పెత్తనం ఏమిటని అదే నినాదంతో ప్రస్తుత అధ్యక్షుడు ఎన్నికల్లో గెలిచాడు. ఇండియా ఔట్ అనే నినాదాన్ని మొయిజ్జు బలంగా ఎన్నికల్లో వినిపించాడు. మాజీ అధ్యక్షుడు ఇబ్రహీమ్ మహ్మద్ సోలేహ్ ఇండియాఫస్ట్ అంటూ నినాదాలిచ్చారు. అధ్యక్షుడుగా వచ్చిన మహ్మద్‌మొయిజ్జు మొదటినుంచీ కూడా భారత్‌కంటే చైనావైపే మొగ్గుచూపిస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన మొదటినుంచీ కూడా భారత్ వ్యతిరేక చర్యలకు దిగుతూనే ఉన్నాడు. ఆదేశంలో ఉన్న భారత బలగాలు వెళ్లిపోవాలనే బలంగా చెపుతున్నాడు. ఇక చైనా పరంగా చూస్తే ఈ చిన్న ద్వీపకల్పంలో తన స్థావరాలను పటిష్టం చేసుకోవడం కోసం చైనా తనకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను సైతం అన్వేషిస్తున్నాడు. తన సతీమణి సాజీదా మహ్మద్‌తో కలిసి ఆయన చైనాకు వెళ్లాడు. ఈ వివాదానికి కేంద్ర బిందువులుగా మారిన ప్రజాప్రతి నిధులు సస్పెండ్ అయినా ఈ వివాదం మాత్రం ఎక్కడా సద్దుమణగలేదు. సరికదా రెండుదేశాల దౌత్యబంధంపై ప్రభావం చూపిస్తోంది. పర్యాటకరంగంపై ప్రభావం చూపించింది. ఎవ్వరూ మాల్దీవులకు వెళ్లవద్దని నెటిజన్లు ప్రత్యేక ఉద్యమంగానే ప్రారంభించారు. అంతేకాకుండా ఈజ్‌మై ట్రిప్ వంటి సంస్థలు తమ విమాన బుకింగ్‌లను కూడా నిలిపివేసాయి. ఫలితంగా మాల్దీవుల పర్యాటక ఆదాయం మరింతగా పడిపోయింది. ఇంత జరుగుతున్నా అధ్యక్షుడు మొయిజ్జుకు తెలిసిరాలేదనే చెప్పాలి. చైనాకు వెళ్లి తమ దేశానికి పర్యాటకులను పంపించాలని, మా దేశంలో అన్ని వసతులు కల్పిస్తామంటూ ప్రాధేయపడటం ఆ దేశ సార్వభౌమత్వాన్ని మరొకరి వద్ద తాకట్టుపెట్టినట్లే భావించాలి. అందువల్లనే నష్టనివారణ కోసం మొయిజ్జు దంపతులు ఐదురోజులపాటు అధికారిక పర్యటనకు వెళ్లారు. భారత్ అంటే గిట్టని చైనా సహజంగానే మాల్దీవులను అక్కున చేర్చుకుంది. భారత్‌కు వ్యతిరేకంగా ఏచిన్న అవకాశం లభించినా చైనా వదులుకోదన్న సంగతి తెలిసిందే. పొరుగుననే ఉన్న పాకిస్థాన్‌ను చేర్చుకుంది. ఐక్య రాజ్యసమితి భద్రతా మండలిలో సైతం పాక్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది. భారత్ ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానానికి మోకాలడ్డుతోంది. ఆర్థిక సంక్షోభంలో ఉన్న శ్రీలంకకు నిధులు ధారాళంగా ఇస్తామని ఎరవేసింది. ఇప్పుడు భారత్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగే మాల్దీవులను తనవైపునకు తిప్పుకుంది. దౌత్యపరమైన అంశాల్లోకూడా చైనా జోక్యం ఆదేశం పతనానికి అడ్డంపడుతున్నదని స్పష్టం అవుతోంది. పైకి ఈ మూడుదేశాలమధ్య త్రైపాక్షిక సంబంధాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని నీతులు చెపుతున్న చైనా భారత్‌పై మాల్దీవుల ప్రజాప్రతి నిధులు చేసిన వ్యాఖ్యలను ఇప్పటివరకూ ఖండించలేదు. పైగా ఏదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నా సహించబోమంటూ హెచ్చరికలు జారీచేసింది. అంతేకాకుండా భారత్‌కు వ్యతిరేకంగా చేయాల్సిన కుట్రలన్నీ చేస్తోంది. చైనా మాల్దీవుల మధ్య ఉన్న సంబంధాలు మరింత మెరుగుపడతాయని, కొత్త శిఖరాలకు చేరతాయంటూ ఆదేశానికి భరోసా కూడా ఇచ్చింది. భారత్‌పై వ్యతిరేకత వెళ్లగక్కిన మాల్దీవుల అధికార పార్టీకి గడ్డుకాలం దాపురిస్తోందన్నది మాత్రం మరిచిపోయింది. ఏకంగా అధ్యక్షుడిని పదవీచ్యుతి చేసేందుకే అక్కడి ప్రతిపక్షాలు నడుంబిగించాయి. మొయిజ్జుపై అవిశ్వాస తీర్మానానికి పిలుపు నిచ్చారు. మాల్దీవుల్లో స్థిరమైన విదేశాంగ విధానం కొనసాగాలంటే మొయిజ్జు గద్దెదిగిపోవాలన్న ఏకైక సందేశంతో ప్రతిపక్షాలు అవిశ్వాసంపై పనిచేస్తున్నాయి. ఆ దేశ పార్లమెంటరీ మైనార్టీ నాయకుడు అలీ అజీమ్ కనుసన్నల్లో ఈ అవిశ్వాసం వ్యవహారం నడుస్తోంది. అదే జరిగితే ప్రస్తుత అధ్యక్షుడు మొయిజ్జు తనంత తానుగా రాజీనామా చేయడమే ఆయన గౌరవాన్ని ఇనుమడింప చేసుకున్నట్లవుతుంది. అయితే మొయిజ్జు వ్యవహారశైలి చూస్తే విదేశీ జోక్యంతో అయినా తన పదవిని కాపాడుకోవాలన్న లక్ష్యంతో ఉన్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే భారత్‌పై అనవసర వ్యాఖ్యలు చేసి మాల్దీవులు తన కొరివితో తానే తలగోక్కునట్లయిందనడం అతిశయోక్తి కాదనిపిస్తోంది.

తెలివిగలవారు ఎప్పుడూ కూడా ఇతరులు వైఫల్యం చెందిన చోట నుంచి విజయాన్ని సాధించడం ప్రారంభిస్తారు.



-ఎడిసన్

నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.



-షేక్స్పియర్

# వ్యవసాయంలో ప్రైవేటు జోక్యాన్ని నివారించాలి

రైతుల వ్యవసాయం సజావుగా సాగాలన్నా, మనదేశ వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాదుల జోక్యాన్ని అరికట్టాలి. విదేశీ బిటి, హైబ్రీడ్ విత్తనాల స్థానంలో దేశీయ విత్తనాలను అభివృద్ధి చేయాలి. అన్నిరకాల పంట ఖర్చులను లెక్కించి దానిపై 50శాతం పెంచి మద్దతు ధర ప్రకటించి, దానికి చట్టబద్ధత కల్పించాలి. ప్రభుత్వ సంస్థలే రైతులనుండి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయాలి. ఎరువుల, విత్తనాల, డీజిల్ సబ్సిడీలు ఎక్కువగా పెంచాలి. 4 శాతానికి రైతుల అవసరం మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలి.

బొల్లిముంత సాంబశివరావు

దేశంలో కార్పొరేట్ సంస్థల అధిపతులు ప్రపంచ ధనవంతుల జాబితాలో స్థానం పొందితే, దేశానికి అన్నం పెట్టే రైతులు మాత్రం ఆత్మహత్యల జాబితాలోకి చేరుతున్నారు. ఈ జాబితా నిరంతరం పెరుగుతూ ఉండి ప్రజా తంత్రవాదులు, రైతాంగ ప్రయోజనాలు కోరుకునే మేధావులు, జర్నలిస్టులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎవరు కాదన్నా ఔనన్నా భారతదేశం వ్యవసాయక దేశం. 68% ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో నేడు కూడా 14.5%వాటా కలిగి ఉంది. 2020 లెక్కల ప్రకారం దేశ మొత్తం కార్మికుల్లో 41.48% వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. భారతదేశంలో జరిగిన మొత్తం ఆత్మహత్యల్లో దాదాపు 12% రైతుల ఆత్మహత్యలున్నాయి. దాదాపు 68% మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తున్న దేశ వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడానికి, రైతులు బలవన్మరణాల పాలు కావడానికి కారణమేమిటి? ఆ కారణాలు తెలిసినప్పుడే సంక్షోభ మూలాలు అర్థమౌతాయి. బ్రిటిష్ వలస పాలకుల నుండి అధికారాన్ని చేతులుమార్చుకున్న దేశీయ పాలకులు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు, విదేశీ గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలమైన విధానాలు అధికార మార్పిడితోనే ప్రారంభించారు. దేశీయ బడాబూర్జువా వర్గం సామ్రాజ్యవాదానికి దళారీ వర్గంగా వలసపాలన దగ్గర నుంచి నేటి వరకు పనిచేస్తూనే ఉంది. దేశానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయ రంగాన్ని దేశీయ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించటానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రణాళికలురూపొందించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. 1951 సెప్టెంబర్ 27న వ్యవసాయ శాఖ నిర్వహించిన సదస్సులో దేశంలోని భూములు, పంటలు, వాతావరణాలను పరిగణలోకి తీసుకుని భారతీయ వ్యవసాయాన్ని పునరుజ్జీవింప చేయటానికి కార్యక్రమం రూపొందించారు. ప్రతిగ్రామంలోని ప్రతి సెకను పరిగణలోకి తీసుకోవటం అత్యంత అవసరమనిగుర్తించారు. భారత దళారీపాలకులు అలాంటి విధానాలు అమలు జరపకుండా సామ్రాజ్యవాదులు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులు ప్రయోజనాలకు అనుకూలమైన విధానాలు ప్రవేశపెట్టారు. అమెరికా నమూనా వ్యవసాయాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టటానికి అమెరికా ఫౌండేషన్లు, అమెరికా ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు ముఖ్యపాత్రను నిర్వహించాయి. వ్యవసాయ విస్తరణలోనూ 1952నుండి ఫోర్డ్ ఫౌండేషన్ పని చేసింది. భారత వ్యవసాయానికి సరికొత్త రూపం ఇవ్వటానికి 1953 నుండి రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ పనిచేసింది. 1905లో ఏర్పడిన భారత వ్యవసాయ పరిశోధనాసంస్థను 1958లో పునరుద్ధరించారు. భారతీయులను అమెరికన్ సంస్థలకు పంపించటానికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని రాక్ ఫెల్లర్ సంస్థ అందజేసింది. ఇలా వెళ్లిన వారు అమెరికా వ్యవసాయం విధానాలను ప్రచారం చేయాలి. మూడవ ప్రపంచ దేశాలకు చెందిన రైతులు, శాస్త్రవేత్తలు అవమానించారు. ఆ విధంగా భారత వ్యవసాయ రంగంపై అమెరికా ఆధిపత్యానికి పునాదులు పడ్డాయి. భారత పాలకులు కూడా దేశంలోని వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన విత్తనాలు అభివృద్ధి చేసి ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు రైతులను ప్రోత్సహించే విధానాలు చేపట్టలేదు. అమెరికా నుండి ఆహార ధాన్యాల దిగుమతికి ప్రాధాన్యత ఇచ్చారు. దానిపై ఆహార ధాన్యాలకు ఆధారపడ్డారు. ఫలితంగా దేశం తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంది. దాని నుండి బయటపడటానికి పిఎల్ ఒప్పందం ద్వారా అమెరికా నుండి గోధుమలను దిగుమతి చేసుకున్నారు. తమ కంపెనీల విత్తనాల, ఎరువుల, పురుగుల మందుల వ్యాపారం కోసం ప్రపంచ బ్యాంక్ ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు హరిత విప్లవం ప్రారంభించామని భారత ప్రభుత్వంపై అమెరికా వత్తిడి చేయించింది. 1967–68 అధికారికంగా భారత దేశం హరిత విప్లవాన్ని ప్రారంభించారు. విదేశాల



నుంచి హైబ్రీడ్ విత్తనాలు, ఎరువులు, తెగుళ్ల నివారణకు పురుగు మందులు దిగుమతి అయ్యాయి. హరిత విప్లవానికి ముందు వ్యవసాయోత్పత్తులు అంత తక్కువగా ఏమీ లేవు. హరిత విప్లవంలో ప్రవేశించిన విత్తనాల వలన ఉత్పత్తులు విపరీతంగా పెరిగిందీ లేదు. హరిత విప్లవం ద్వారా కొద్ది దిగుబడి పెరిగినా, అంతకన్నా ఎక్కువగా పంట ఖర్చులు పెరిగాయి. దేశీయ విత్తనాల అభివృద్ధి ఆగిపోయింది. రసాయనిక ఎరువుల వాడకంతో భూమి గుల్లబారి సారం కోల్పోయింది. రసాయనిక ఎరువులు వాడందే దిగుబడి రాని పరిస్థితి ఉత్పన్నమైన దేశంలో విదేశీకంపెనీల విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారం, లాభాలు మాత్రం విపరీతంగా పెరిగింది. పాలకులు విధానాలతోపాటు, బహుళ జాతి సంస్థలు వ్యవసాయ రంగంలో చొరబడటం వలన సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. 1952లో దేశంలోఎకరా సేద్యపు ఖర్చు 56రూపాయలు అయితే నేడు 40వేలకు పెరిగింది. సేద్యపు ఖర్చులకు అనుగుణంగా పంటలకు ధంలు లభించకపోవటం, ప్రభుత్వమద్దతు ధరలు రైతులప్రయోజనాలను విస్మరించటంవల్ల రైతాంగం అప్పుల పాలై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 2014ఎన్నికల ప్రచారంలో మోడీ రైతుల గురించి అన్నమాటలు గమనిద్దాం. మన రైతులను ఉచ్చులోకి నెట్టగూడదు. రైతులు భారీ రుణాలు తీసుకోగూడదు. షావుకారు తలుపులు తట్టాల్సిన అవసరం లేదు. రైతుల రుణాలు రద్దుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? రైతుల పరిస్థితి మెరుగుపడితే, వారికే కాకుండా పొలాల్లో పని చేసే చాలామందికి ఉపాధిఇస్తుంది. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఇవన్నీ జరుగుతాయని అన్నారు. అధికారంలోకి వచ్చినతర్వాత రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ, అందుకు చర్యలు తీసుకోలేదు. దేశంలో రైతులపై సగటు రుణభారం లక్షపైగా ఉంది. రుణమాఫీ దేశానికి నష్టం అన్నాడు. రైతులు బడా వ్యాపారుల చేతుల్లో పెట్టే విధంగా మూడు వ్యవయసాయ చట్టాలు చేశాడు. వాటిని రైతాంగం వీరోచితంగా తిప్పికొట్టారు. పాలకుల విధానాల వలన అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులబలవన్మరణాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. మోడీ పాలనలో ఇంకా ఎక్కువయ్యాయి. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో, భారత హోంమంత్రిత్వశాఖ కార్యాలయం 1950నుండి ఆత్మహత్యల గణాంకాలను నివేదికగా సేకరించి ప్రచురిస్తున్నది. వీటి లెక్కల్లో వెలుగులోకి రానివి చాలా ఉంటాయి. నేషనల్ క్రైమ్ రికార్డులబ్యూరో ప్రకారం 1995–2014 మధ్య2,96,438 మంది రైతులు బలవన్మరణాలకు గురైనారు. అత్యధికంగా మహారాష్ట్రలో 60,750 మంది రైతులు ఈ జాబితాలో ఉన్నారు. 2010–11లో 15,964మంది రైతులుబలవన్మరణాలకు గురైనారు. 2001 నుండి ప్రతి సంవత్సరం 15వేలమంది రైతులు బలవన్మరణాల పాలైయ్యారు. ఆత్మహత్యలు చేసుకున్నవారిలో ఎక్కువ మంది 30నుండి 59 సంవత్సరాల మధ్యవయస్సు గల వారే. ఆత్మహత్యలకు అత్యంత ప్రభావంతమైన రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, సరళీకరణ తర్వాత30సంవత్సరాల్లో 3లక్షల,50వేల మంది రైతులు బలవన్మరణాల పాలై మొత్తం లక్షా, 474 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు దేశం మొత్తం మీద 33లక్షల మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. విత్తనాల, ఎరువుల, పురుగుమందుల, డీజిల్ ధరలు పెంచి సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగేలా చేసి సేద్యం దండగ అన్న అభిప్రాయం వారిలో కలిగేలాచేసి, వారి భూములను కార్పొరేట్, కాంట్రాక్ట్ సేద్యానికి అప్పగించటం లేదా అమ్మివేసే పరిస్థితులు కల్పిస్తున్నది. మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలు కూడా అందులోభాగమే. భారత దేశంలో రైతాంగం ఆత్మహత్యలకు కారణాలపై నిపుణులుచెబుతున్న విషయాలు ఇలా ఉన్నాయి. ఉత్సా పట్నాయక్, జయంతి ఘోష్, ప్రభాత్ పట్నాయక్ వంటి ఆర్థిక వేత్తలు ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణకు అనుగుణమైన ఆర్థిక విధానంలో మార్పులే రైతుల ఆత్మహత్యలకు కారణమని చెబుతున్నారు. అనేక మంది సామాజిక కార్యకర్తలు సమూహాలు, అధ్యయనాలు ఖరీదైన జన్యపరంగా మార్పుచెందిన పంటలు రైతుల బలవన్మరణాల మధ్య ఉన్న సంబంధాన్ని పేర్కొన్నాయి. బీటీ విత్తనాలు, సాధారణ విత్తనాలకంటే ఖరీదు రెండురెట్లు ఎక్కువ. అధిక ఖర్చుల కారణంగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు పెద్ద మొత్తంలో రుణాలు తీసుకోవటం రైతుల మరణాలకు కారణాలని చెబుతున్నాయి. దేశంలో రైతుల బలవన్మరణాలు ఆగాలన్నా, రైతుల వ్యవసాయం సజావుగా సాగాలన్నా, మనదేశ వ్యవసాయ రంగంలోసామ్రాజ్యవాదుల జోక్యాన్ని అరికట్టాలి. విదేశీ బిటి, హైబ్రీడ్ విత్తనాల స్థానంలో దేశీయ విత్తనాలను అభివృద్ధి చేయాలి. అన్నిరకాల పంట ఖర్చులను లెక్కించి దానిపై 50శాతం పెంచి మద్దతు ధర ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పించాలి. ప్రభుత్వ సంస్థలే రైతులనుండి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయాలి. ఎరువుల, విత్తనాల, డీజిల్ సబ్సిడీలు ఎక్కువగా పెంచాలి. 4 శాతానికి రైతుల అవసరం మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలి. ●

# ప్రజావాక్కు



## హోమియోవైద్యంపై అవగాహన అవసరం

**ఒకప్పుడు** హోమియో వైద్యం చాలా చౌకగా లభించేది. ఇప్పుడు కార్పొరేట్ స్థాయికి వెళ్లింది. ప్రభుత్వాలు హోమియో ఆస్పత్రులు స్థాపించాలి. ఉచితంగా మందులు ఇవ్వాలి. సాధారణంగా ఇంగ్లీషు వైద్యంలో వ్యాధి తగ్గకపోతే, ప్రజలుహోమియో వైద్యాన్ని అనుసరిస్తారు. చాలా మొండి వ్యాధులు హోమియో వైద్యంతో చికిత్స చేయడం జరిగింది. కనుక ప్రతీజిల్లాలోనూ హోమియో ఆస్పత్రి తెరవాలి. హోమియో డాక్టర్లని నియమించాలి. ప్రైవేట్ హోమియో వైద్యానికివేలల్లో ఖర్చుఅవుతోంది. కెజిహెచ్‌లో హోమియో విభాగం ఉన్నప్పటికీని ఆశించినవిధంగా పని చేయడంలేదు. హోమియో వైద్యం చాలానెమ్మదిగా పనిచేస్తుందని చాలామంది ఆరోపిస్తుంటారు. కాని హోమియో మందు చాలా త్వరగా పనిచేస్తాయని రుజువు అయింది.

-వి.వివేకి, విశాఖపట్నం

## నిధులు కేటాయించాలి

**సంక్షేమ** పథకాలు అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అమలు చేయడానికి సిద్ధపడుతూ ఉన్నాయి. దీనికి ధనం ఎవరిస్తున్నారు అని ప్రశ్నించుకుంటే ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజానాయకులు కానేకాదు. బడా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ధనికులు, పేదవర్గాల వారు అంత కన్నాకానేకాదు. అత్యధిక సంపన్నులను కాపాడటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తూనే ఉంటాయి. వారి నుండి పార్టీ ఫండింగ్ పొందడానికి ఆయా రాజకీయ పార్టీలు వారికి తగిన విధంగా సహాయం చేస్తూ ఉంటాయి. వారు పన్నులు చెల్లించడం లేదనేది నిజం. పేద వర్గాల వారి పేదరికం డెఫినిషన్ మారిపోయింది.

-వి.భాస్కర్‌రావు, బొబ్బిలి

## ప్రత్యామ్నాయ పార్టీలు ఉండాలి

**తాము** దేశాన్ని రాష్ట్రాలను బాగు చేస్తున్నామని ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తమది సుపరిపాలన అని అందుకే మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలుపొందామని గొప్పలు చెప్పుకుని సంబరపడ్డారు నరేంద్రమోడీ. తాము గెలిచామన్న అహం కారాన్ని ప్రదర్శించారు. అయితే కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదు. మూడు రాష్ట్రాలలోను బిజెపికి ప్రధాన పోటీదారుగా నిలిచింది. హోదా కాంగ్రెస్ పార్టీకి దక్కాయి.

-ఎం.శివరాజు, హైదరాబాద్

## పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

**కాలం మారుతోంది.** వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోంది. కొందరు వృద్ధులను చాలా మంది పిల్లలు రోడ్లపై, బస్టాండ్లలో వదిలేసి వెళ్లిపోతున్నారు. వారికి ప్రభుత్వం వృద్ధాశ్రమాలు కట్టించాలి. ప్రైవేట్ వృద్ధాశ్రమాలు కట్టి, ప్రైవేట్ వ్యక్తులు బాగా ధనం సంపాదిస్తున్నారు. ఒకరి అవసరం, ధనం ఆర్జనకి పనికి రాకూడదు. డబ్బున్న వాళ్లసంగతి సరే. పేదవారి సంగతి ఏమిటి? ప్రతి జిల్లాలోనూ వృద్ధాశ్రమం, ఉచిత వైద్యం కల్పించాలి. పార్టీలు, కేంద్రరాష్ట్రాలతో సంబంధం లేకుండా ప్రతి ప్రభుత్వం వృద్ధాశ్రమాలు నెలకొల్పి, ఆసరా లేని వృద్ధులను ఆదుకోవాలి. శరీరం పడిపోయినప్పుడు, అన్ని లాంచనాలతో మహాప్రస్థానం కలిగించాలి. ఎవ్వరూనిత్యయవ్వనునిగా ఉండిపోరని వృద్ధాప్యం బాల్యం యవ్వనంతరువాతవచ్చే స్థితినిఅందరూ గ్రహించాలి.

-వి. కనకమ్మ, విశాఖజిల్లా

## గ్రంథాలయాలపై దృష్టి పెట్టండి

**రాష్ట్రంలో** ఉన్న పలుజిల్లా కేంద్ర, శాఖా గ్రంథాలయాల పరిస్థితి పాఠకుల్లో గుబులు పుట్టిస్తోంది. శిథిలావస్థలో కొన్ని గ్రంథాలయాలున్నాయి. బోర్డుసీలింగ్ ఊడటంతో పాఠకులు భయాందోళనకు గురవుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించాలి. పోటీ పరీక్షలకు ఉపయోగపడే న్యూసిలబస్ పుస్తకాలు అందుబాటులో ఉండేలా సరిపడే సిబ్బంది ఉండేలా ప్రభుత్వ అధికారులు స్పందించి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

-తూలుగు రమణారావు, అక్కరాపల్లి

## చదువులపై ఆంక్షలు ఎత్తివేయాలి

**అఫ్ఘానిస్థాన్** తాలిబన్ పాలకులు చదువులపై వింత ఆంక్షలు విధించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బాలికలు కేవలం ఆరో తరగతితోనే తమ చదువులను ముగించాలని తాలిబన్ సర్కార్ ఆదేశించింది. నాటో, అమెరికా సేనలు అఫ్ఘానిస్థాన్ నుంచి నిష్క్రమించాయి. అనంతరం కొద్ది రోజులకే తాలిబన్ల కన్ను బాలికల చదువులపై పడింది. ఆరో తరగతి నుంచి చదవడానికి వీలు లేదని ఆంక్షలు పెట్టింది. ఈ నిషేధాన్ని విశ్వవిద్యాలయాలకు వర్తింపచేసింది. ఇలాంటి చర్యలు తీసుకుంటే తాలిబన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ప్రపంచ దేశాలు హెచ్చరించినా తాలిబన్లు ఖాతరు చేయడం లేదు. తాలిబన్ల చర్య ఉన్న చదువును చదవాలనే బాలికల ఆశలను నిరాశకు గురిచేస్తుంది.

-సి. చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

## ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

# ఆన్‌లైన్ ఆటలతో జీవితాలు బలి!

మోటె చిరంజీవి

ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి చాలామంది యువతీ యువకులు ఆన్‌లైన్‌లో ఆటలుఆడి తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సరదాగా ఆడటం మొదలుపెట్టి, ఆ ఆటలకు బానిసై, పెయిడ్ గేమ్స్, బెట్టింగ్ గేమ్స్ ఆడి దాచుకున్న డబ్బులను కోల్పోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోయి, అప్పులు కట్టలేక తమప్రాణాలను బలి తీసుకుంటున్నారు. అప్పుల పాలైనటువంటి వారు తిరిగి కట్టలేక ఇంట్లో వాళ్లకు చెప్పలేక, తమప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంకొంద రైతే అప్పులు తీర్చేందుకు దొంగలుగా, చైన్స్ స్నాచర్లుగా సైబర్ నేరగాళ్లుగా మారుతున్నారు. డబ్బులకోసం ఇంట్లో వారిని చంపడానికి కూడా వెనుకాడడం లేదు. బంధాలు బంధుత్వాలను కూడా ఆదమరచి ప్రాణాలను తీస్తున్నారు. ఈ పెయిడ్ గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ బారినపడి నేటి యువత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటుంది. ఇందులో ఎక్కువగా 20నుండి35 సంవత్సరాల వయస్కులు ఎక్కువగా ఉండడం అందరినీ ఆందోళన కలిగించే విషయం. ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి వారు ఇంటర్నెట్‌లో లేదా స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లను వెతికి అందులోని రమ్మీ, ఐపిఎల్ బెట్టింగ్, ఫ్రీ మనీ ఎర్నింగ్ యాప్స్ అని ఎన్నో యాప్‌లను ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో సరదాగా మొదలుపెట్టిన ఆటలు, చివరికి వాటికి అలవాటుపడి జీవితాన్ని బలితీసుకునే దిశగా వెళ్తున్నారు. కొందరికి అవి ఆన్‌లైన్‌గేమ్స్ అని, క్రికెట్ బెట్టింగ్ అని తెలియకుండానే ఆ ఊబిలో చిక్కుకొనిపోతున్నారు. కరోనా సమయంలో పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు జరిగేవి. అలాంటి సమయంలో పాఠశాల విద్యార్థులు మొదలుకొని కళాశాలలో చదువుకునేటటువంటి యువతీ యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగ ఉపాధి లేనివారు ఈజీగా డబ్బులుసంపాదించాలనే యావతో ఆన్‌లైన్ ఆటలకు ఆడిక్ట్‌అయ్యి, వాటిపై ఇంట్రెస్ట్‌చూపి, డబ్బులు డిపాజిట్ చేసి గేమ్‌ఆడితే సంపాదించవచ్చు అన్నఆశలతో అప్పులుచేసి, అప్పుల ఊబిలో చిక్కుకొని కష్టపడి సంపాదించిన దాన్నంతా కూడా పోగొట్టుకుంటున్నారు. బెట్టింగులను ఆర్గనైజ్ చేసే వాళ్లు మొదట్లో కావాలనే కొంతడబ్బును యూజర్లు గెలుచుకునేలా చేశారు. దీంతో ఉత్సాహంగా మరింత సొమ్ము తెచ్చి గేమ్స్ ఆడుతూ బెట్టింగ్ కడుతుంటారు. డబ్బులు పోగొట్టుకున్న మళ్లీ రాకపోతాయని ప్రయత్నిస్తుంటారు. ఇలా నిండా మునిగిపోతుంటారు. కొద్దిరోజులుగా రాష్ట్రంలో చాలా మంది యువత ఇలాగే నష్టపోయారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు వివిధ రకాల యాప్‌లు, వెబ్‌సైట్‌ల ద్వారా బిజినెస్ చేస్తున్నాయి. ఇప్పుడు గూగుల్, పేటిఎం, ఫోన్‌పేలో ద్వారా కూడా ఈ ఆటలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కొన్ని సంస్థలు పెయిడ్ గేమ్స్ ద్వారా గేమర్స్‌కి మనీఇస్తున్నాయి. ఆన్‌లైన్ రమ్మీవంటి గేమ్‌లకు రూ.50నుంచి కూడా డబ్బు పెట్టే చాన్స్ ఉంటుంది. ముందు కొంత అమౌంట్ గేమ్‌ఆడేవారి అకౌంట్‌లోకి వస్తుంది. దీంతోపాటు గేమ్‌లకు రివార్డ్స్ఇస్తూ ఆకర్షిస్తుంటారు. టి20లు వన్డేలు, ఐపిఎల్, ఆఖరికి టెస్ట్‌మ్యాచ్లు, ప్రోకబడ్డీ, రమ్మీ, పేకాట, వీడియో గేమ్స్ ఇలా ఆన్‌లైన్ మోసానికి బలవుతూ ఉన్నారు. మొదట్లో రూపాయల్లో ఆశపెట్టి వందల్లో లాభాలు చూపి, తర్వాత వేలల్లో ఆశపెట్టి లక్షలుదోచేస్తున్నారు. నేటి యువతీ యువకులు పలురకాల ఆటలపై ప్రజల్లో ఉన్నమోజును క్యాష్ చేసుకునేందుకు నకిలీ యాప్‌లను సృష్టించి, వాటిద్వారా కూడా సులువుగా డబ్బులు సంపాదిస్తున్నారు ఈ బెట్టింగ్ ఆన్‌లైన్ గేమ్‌ల ద్వారా. ఇంకా కొన్ని యాప్‌లను గనుక చూస్తే ఇంకా ముందుకు వెళ్లివారే రుణాలుఇస్తూ మళ్లీ డబ్బులు కట్టించి అదే గేమ్‌కు బానిసగా కూడా చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు రాకముందు ప్రశాంతమైన జీవితం గడిపినటువంటి వారు స్మార్ట్‌ఫోన్లు వచ్చిన తర్వాత జీవితాలను బలి తీసుకుంటున్నారు. ●

# వర్సిటీల్లో ఎంఫిల్ కోర్సు రద్దు సబబేనా?

డాక్టర్.కోలాహలం రామ్ కిషోర్

ఈ అకాడమిక్ ఇయిర్‌లో మన దేశ విశ్వవిద్యాలయాల్లో ఎంఫిల్ కోర్సులో చేరాలని ఉత్సాహపడుతున్నవిద్యార్థుల అభిలాషను నిరుత్సాహపరుస్తూ గతనవంబర్ 2022న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆ కోర్సును రద్దు చేసినట్లు చేసినప్రకటన వారిని తీవ్రనిరాశకు గురిచేసింది. అయితే దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈఎంఫిల్ కోర్సు ఎందుకు రద్దు చేశారో కారణాలను మాత్రం యూజీసీ ప్రకటించలేదు. ఒక కోర్సును కొనసాగించాలా? తిరస్కరించాలా? దాని స్థానంలో మరో నూతన కోర్సును ప్రవేశపెట్టాలా అనే విషయంలో అంతిమనిర్ణయం తీసుకొనే అధికారం యూజీసీకి ఉంది. దానిని ఎవరూ ప్రశ్నించటం లేదు. అయితే ఒక కోర్సును ప్రారంభించటానికి లేదా అర్థాంతరంగా రద్దు చేయటానికి సహేతుక కారణాలను వెల్లడించడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఎంఫిల్ అనేది పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత పరిశోధన కోసం చేసి షార్ట్‌టరమ్ కోర్సు. ఇది పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు డాక్టోరల్ కోర్సుల మధ్య ఉన్నటువంటి మిడ్‌వే కోర్సు. పీహెచ్‌డీ అనేది దీర్ఘకాలిక పరిశోధన కోర్సు. ఇది సైన్స్ సబ్జెక్టులలో దాదాపు నాలుగు సంవత్సరాల వరకు కాలపరిమితి ఉంటుంది. (అవసరమైతే రీసెర్చ్ సూపర్‌వైజర్ అనుమతితో కాలపరిమితి యూనివర్సిటీ పొడిగిస్తుంది. అలాగే ఫీల్డ్ డేటాకలెక్షన్‌పై ఆధారపడిన ఆర్ట్స్, సోషల్ సైన్స్, హ్యూమానిటీస్ సబ్జెక్టులకు 4–5 సంవత్సరాలకు మించి కాలపరిమితి ఉంటుంది. పిహెచ్‌డీ వంటి దీర్ఘకాలిక కోర్సును కొనసాగించలేని వారు కేవలం మూడు సెమిస్టర్‌ల వరకు మాత్రమే ఉండే ఎంఫిల్‌ని రీసెర్చ్ స్కాలర్లు ఎంచుకోవచ్చు. గతంలో యం.లిట్ కోర్సు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ తర్వాత అనేక విశ్వవిద్యాలయంలో ఉనికిలో ఉండేవి. కానీ, 1970లలో, ఈ కోర్సుకు బదులు కొత్తగా ఎంఫిల్‌తో దానిని భర్తీ చేశారు. ఆవిధంగా పరిశోధన ద్వారా పేరుమాత్రమే ఎంఫిల్ డిగ్రీకి మార్చబడింది. తత్వశాస్త్రం సాహిత్యంతో సహా అనేక రంగాలకు కలిగి ఉన్నందున ఇది మాస్టర్ ఆఫ్ లిటరేచర్ కాదు, పిహెచ్‌డిలోవలె మాస్టఆఫ్ ఫిలాసఫీ చేపట్టాలనుకుంటే ఎంఫిల్ వంటి షార్ట్‌డ్యూరేషన్ కోర్సును ఎంచుకుంటారు. యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎంలు, ఇతర జాతీయ పరిశోధనా సంస్థలో టీచింగ్/పరిశోధనా పొజిషన్‌లను స్వీకరించడానికి, పీహెచ్‌డీ అవసరం. అయితే, ఇటీవల కాలంలో యూజీసీ ఏదైనా అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలల్లో ఫ్యాకల్టీగా పనిచేయటానికి ప్రవేశస్థాయిలో పీహెచ్‌డీ అర్హత తప్పనిసరి కాదని యూజీసీ తెలిపింది. నిజానికి టీచింగ్, రీసెర్చ్, అనేవి ఒకే నాణేనికి ఉండే రెండు పార్శ్వాలు వంటివి. టీచింగ్ ప్రొఫెషన్‌లో పనిచేసే ప్రతిఒక్కరికీ చక్కటి బోధనా




నైపుణ్యాలతోపాటు పరిశోధనా దృక్పథం ఉండటం అవసరం. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు. పోషకాలు కూడా. వీటిని విడివిడిగాచూడలేం. ఇంటర్మీడియట్ స్థాయిలోబోధించే లెక్చరర్లకు మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ చాలావరకు ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఇంటర్ విద్యార్థులు 15–16 సంవత్సరాల టీన్ ఏజ్‌లో ప్రవేశిస్తారు. ఆ వయసులోని వారి మానసికస్థితి భిన్నంగా ఉంటుంది. మలుపు తిప్పే పరిస్థితి ఉంటుంది. కనుక వారికి బోధించటానికి జూనియర్ కాలేజీల్లో పనిచేసే జూనియర్ లెక్చరర్లకు ఎడ్యుకేషన్ సైకాలజీలో శిక్షణ పొందటం అవసరం. కానీ ఇంటర్మీడియట్ బోర్డ్ ఆ నిబంధన విధించలేదు. ఇక అండర్ గ్రాడ్యూయేట్ కోర్సుల్లో వందశాతం బోధనే ఉంటుంది. పరిశోధనా అవకాశాలు, వనరులు, వసతులు ఉండవు. కనుక వారికి పీజీతోపాటు పరిశోధనా దృక్పథం కోసం ఎం.పిల్ డిగ్రీ ఉంటే సరిపోతుంది. ఇవి మైనర్, మేజర్ రీసెర్చ్‌లను పూర్తి చేయటానికి అధ్యాపకులకు ఉపయోగపడతాయి. యూనివర్సిటీ సర్వీసులలోకి వెళ్లదలచిన వారికి పి.హెచ్.డీ తప్పనిసరిగా అవసరం అవుతుంది. అక్కడ పీజీ విద్యార్థులకు బోధనతోపాటు పరిశోధనా నైపుణ్యాలు అలవాటుకావాలి. అంతేకాకుండా యూనివర్సిటీలుపీహెచ్‌డీ కోర్సులతోపాటు అనేకవిషయాల్లోరిసెర్చ్ ప్రాజెక్టులనుకూడా అనుబంధంగా చేపడతాయి. యూనివర్సిటీలు ప్రధానంగా పరిశోధనా కేంద్రాలుగా ఉంటాయి. ఏదైమైనా, పరిశోధన అనేది ఇప్పటివరకుఅన్వేషించని అంశాన్ని ఎంచుకున్న సరికొత్త విషయం. దాన్ని క్రమబద్ధమైన విచారణచేసి, పరిశోధనతో కొత్త జ్ఞానాన్ని వెలికితీయడం కావచ్చు లేదా ఇప్పటికే ఉన్న జ్ఞానావిష్కరణ ఈసమాజానికి భౌగోళిక సరిహద్దులు లేని మానవ కళ్యాణానికి తోడ్పడాలి. బోధనకోసం పరిశోధన అనేక స్వాభావిక ప్రయోజనాలను అందిస్తుంది. పరిశోధన తనంతట తానుగా నిలబడగలిగినప్పటికీ, బోధనకు పరిశోధనతో విలువను నూతనంగా జోడిస్తుంది. పరిశోధనా డిగ్రీని కలిగి ఉన్న ఉపాధ్యాయుడు తన బోధనకు క్లిష్టమైన, విశ్లేషణాత్మక విధానాన్ని అభివృద్ధి చేస్తాడు. అతడు విద్యార్థులలో హేతుబద్ధత, ప్రశ్నించేవైఖరిని పెంపొందించగలగుతాడు. విద్య ఉద్దేశ్యం దాని సంపూర్ణతలోజ్ఞానాన్ని పొందటం. పరిశోధనా బోధనను అత్యంత ప్రభావవంతమైన మార్గంలో భర్తీచేస్తుంది. విశ్వవిద్యాలయాలు, జాతీయఉన్నత విద్యాసంస్థలో అధ్యాపకులుగా పరిశోధకులకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఇది కారణం. ఎంఫిల్‌అవశ్యకత పీహెచ్‌డీ వంటి పరిశోధనా కోర్సులకు ఎక్కువ సమయం పడుతుందికాబట్టి, కాలేజీ స్థాయిలో టీచింగ్ పొజిషన్‌లను చేపట్టాలనే ఆసక్తి ఉన్నవారు ఎంఫిల్‌వంటి సంక్షిప్తకోర్సుతో బాగా రాణించగలుతారు. గతంలో విద్యానిపుణుల తమ విజ్ఞతతో ఎంఫిల్ కోర్సును రూపొందించారు. విదేశాల విశ్వవిద్యాలయాలు సైతంఎంఫిల్‌ను ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. ఎంఫిల్ కోర్సులో పరిశోధన మూలాధార సూత్రాలు పరిశోధకుడికి అందించబడతాయి. పరిశోధన సాధారణ సూత్రాలు ప్రతిబ్రాంచ్‌కు సాధారణం. ఇది ఎంఫిల్ కోర్సు కళాశాల స్థాయిలో కాబోయే ఉపాధ్యాయుడు సమర్థవంతమైన ఉపన్యాసకుడిగా రాణించటానికి తగినంత సమాచారం అందిస్తుంది. ●